క్లుప్తంగా

ఎమ్మెల్సీ స్థానానికి ప్రసాద్‌రాజా నామినేషన్



లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయవాడ బార్ అసోసియేషన్ సెక్రటరి అరిగల శివరామ్ ప్రసాద్ రాజా సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయనతో పాటు బెజవాడ బార్ అసోసియేషన్, కృష్ణా జిల్లా ఫెడరేషన్ అధ్యక్షులు కొత్త చంద్రమౌళి, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, గుంటూరు బార్ ఫెడరేషన్ అధ్యక్షులు కాసు వెంకట రెడ్డి, సీనియర్, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, నారదాసు వీర మణీంద్ర, భగవాన్ రాయపూడి శ్రీనివాసరావు, మహిళ యువ న్యాయవాదులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్స్ పాల్గొన్నారు.

చివుకులకు ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరానికి చెందిన డాక్టర్ చివుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సుగుణ సైన్స్ అకాడమీ సీఈఓ డాక్టర్ చివుకుల సాంబశివరావు 'డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ఈమేరకు తెలుగు కళ రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయగాన సంస్థ సీఈఓ డాక్టర్ యూవీ రత్నం, తెలంగాణ బీజేఎంఎస్ అధ్యక్షుడు డాక్టర్ మద్దిశెట్టి శామ్యూల్, డాక్టర్ రాజబాబు, డాక్టర్ ధనవాసి ఉషారాణి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కాటూరి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ పత్రి వేణుగోపాల్, సీబీఎన్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



గుంటూరు మెడికల్: వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గుజ్జనగుండ్ల మున్సిపాలిటీ ఆఫీస్‌లో పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేశారు. వైద్య శిబిరంలో 147 మంది పారిశుద్ధ్య కార్మికులు వైద్య పరీక్షలు నిర్వహించి, అందులో 25 మందికి శుక్లాలు, పొరలు గుర్తించినట్లు హాస్పిటల్ పీఆర్‌ఓ వెంకట్రావు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ, ఈఎస్‌ఐ కార్డులున్నవారికి గుంటూరులోని వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్‌లు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మేనేజర్ గోపీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐజాక్ పాల్గొన్నారు.

చిలుకూరు ఆలయ అర్చకుడిపై దాడి హేయం

నగరంపాలెం: చిలుకూరు ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి ఉన్మాద చర్య అని ఆంధ్రప్రదేశ్ ఐక్యవేదిక(అర్చక జేఏసీ) నాయకులు మండిపడ్డారు. బ్రాడీపేటలో సోమవారం అర్చక జేఏసీ సమావేశం నిర్వహించారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కంఠం నందీశ్వర్ మాట్లాడుతూ చిలుకూరు శ్రీబాలాజీ దేవస్థానం అర్చకులు రంగరాజన్‌పై రెండు రోజుల క్రితం దాడి చేసిన 'రామరాజ్యం'నాయకుడు వీర రాఘవరెడ్డి చర్యలు ఉగ్రవాదాన్ని తలపిస్తున్నాయని అన్నారు. రామరాజ్యం పేరుతో ఒక దళాన్ని ఏర్పాటు చేసి శ్రీరాముని పేరుని అప్రతిష్ట పాలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో జేఏసీ నాయకులు యనమండ్ర సత్యసీతారామశర్మ, ఎం.ఏ.శేషాచార్యులు, జంధ్యాల వెంకట రామలింగేశ్వరశాస్త్రి, కొత్తలంక మురళీకృష్ణ, కిరణ్‌కుమార్, ఎ.అక్షయలింగశర్మ, జి.లక్ష్మీపతి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టడం సామాజిక బాధ్యత



పొన్నూరు: బాల్య వివాహాలు అరికట్టడం సామాజిక బాధ్యత అని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహ వ్యతిరేక ప్రచారంపై నిర్వహించిన నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొని మాట్లాడుతూ చిన్నతనం నుంచే మహిళలను గౌరవించాలని అబ్బాయిలకు చిన్నతనం నుంచే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎస్.వెంకట రమణ, హెచ్‌ఎం ఎం.జ్యోతిర్మయి పాల్గొన్నారు.

'సత్యవేణిది పల్నాడు జిల్లా గురజాల. కూలి పనులు చేసుకుని జీవిస్తోంది. అనారోగ్యంతో ఆర్‌ఎంపీని ఆశ్రయించింది. పరీక్షించి యాంటీబయాటిక్స్ వాడాలని సూచించాడు. వాడిన తరువాత ఆమెకు కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు అవుతున్నాయి. ఆర్‌ఎంపీ చేతులెత్తేయటంతో గుంటూరుకు చికిత్స కోసం వచ్చింది. ఐసీయూలో అడ్మిట్ చేసి చికిత్స అందించారు. నిపుణులైన వైద్యులు పరీక్షించి అతిగా మింగడంతో సమస్య వచ్చినట్లు తేల్చిచెప్పారు.'

'గుంటూరు ఆర్టీసీ కాలనీకి చెందిన సుబ్బారావు లారీ డ్రైవర్. కొద్దిపాటి సమస్య వచ్చిన తక్షణమే మందులషాపునకు వెళ్లి యాంటిబయాటిక్స్ ఉపయోగిస్తున్నాడు. చర్మ సంబంధిత సమస్య వచ్చింది. ఎంతోకాలంగా వినియోగించిన తగ్గడం లేదు. దీర్ఘకాలికంగా చర్మ సంబంధిత సమస్య ఉండటానికి యాంటీ బయాటిక్స్ మందుల వినియోగం ఎక్కువగా జరిగిందని వైద్యులు నిర్ధారించారు. నెలరోజుల పాటు ఆస్పత్రిలో అడ్మిషన్‌లో ఉండి చికిత్స చేశారు. చర్మం సాధారణ స్థితికి వచ్చింది. లంగ్స్ సమస్య కూడా తగ్గింది.

యాంటీబయాటిక్స్

పనిచేయటం లేదట!

- విచ్చలవిడిగా మందులు వాడటమే కారణం
- ప్రతినెలా జీజీహెచ్‌కు వంద మంది బాధితులు
- అవగాహన కలిగి ఉండాలి



గుంటూరు మెడికల్: ఆరోగ్య సమస్య ఏదైనా ప్రతిఒక్కరూ ఎదుటి వారికి ఉచిత సలహా యాంటీబయాటిక్స్ వాడొచ్చుకదా! అని.. వైద్యుని సలహా మేరకు వాడాల్సిన మందులు వైద్యుల సలహా లేకుండా, మోతాదుకు మించి, అనవసరంగా వాడటం వల్ల ప్రస్తుతం ఆ మందులు పనిచేయటం లేదు. ఈ సమస్య వల్ల ఆరోగ్యం విషమించి ఐసీయూలో చికిత్స పొందుతున్న అనేక మంది ప్రపంచ వ్యాప్తంగా చనిపోతున్నారు. గుంటూరు జీజీహెచ్‌కు ప్రతి నెలా 100 మంది బాధితులు యాంటీ బయాటిక్స్ విచ్చలవిడిగా వాడి ఇన్‌ఫెక్షన్స్ సోకి చికిత్స కోసం వస్తున్నారు.

కోవిడ్ కంటే ఎక్కువ మరణాలు....

యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ వలన ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 70 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ గణంకాలు వెల్లడిస్తున్నాయి. కోవిడ్ మరణాల కంటే యాంటీ బయాటిక్స్‌మందులు పనిచేయక పోవటం వలన మరణిస్తున్న వారే ఎక్కువ మంది ఉన్నారని ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్టులు చెబుతున్నారు. బ్యాక్టీరియా, వైరస్, శిలింధ్రాలు, పరాన్న జీవులు ఇతర వ్యాధి కారక సూక్ష్మ క్రిములను సంహరించే మందులను యాంటీ మైక్రోబియల్ ఔషధాలు అంటారు. ఈ ఔషధాలు తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ల నుంచి, సాంక్రమిత వ్యాధుల నుండి మనుషులను, జంతువులను, మొక్కలను కాపాడతాయి. నిర్దిష్టమైన సమయంలో, నిర్దిష్టమైన మోతాదులో కాకుండా ఇష్టానుసారంగా, ఎప్పుడు పడితే అప్పుడు, ఎలా పడితే అలా మోతాదుకు మించి యాంటీ బయాటిక్స్ వాడటం వలన ఐసీయూల్లో చికిత్స అందిస్తున్న వారిలో నూటికి 90శాతం మందులు పనిచేయటం లేదని వైద్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ చికిత్సలకు వాడే మందుల్లో 50 శాతం వరకు యాంటీ బయాటిక్స్ మందులు పనిచేయటం లేదు.

అనర్థాలు ఇలా...

ఇష్టాను సారంగా యాంటీబయాటిక్స్ వాడితే కిడ్నీలు, లివర్ ఇతర శరీర అవయవాలు పాడైపోతాయి. అవసరానికి మించి మందులు వాడటం ద్వారా భవిష్యత్‌లో జబ్బు సోకితే యాంటీ బయాటిక్స్ వేసుకున్న పనిచేయవు. ఎందుకంటే మంచి బ్యాక్టీరియాకు రిసిస్టెన్స్ వస్తుంది. డెంగీ, చికున్‌గున్యా, వైరల్ ఫీవర్స్‌కు 30శాతం యాంటీ బయాటిక్స్ అవసరం ఉంది. కాని ప్రస్తుతం 70శాతం వాడుతున్నారు. ఇది చాలా నష్టాన్ని కలుగజేస్తుంది. ఒకరు యాంటీబయాటిక్స్ అనవసరంగా వాడితే సమాజం మొత్తానికి నష్టం చేకూరుస్తాడు.

మార్పు రావాలి...



ప్రాణాపాయ స్థితిలో ఉండే రోగులను కాపాడేందుకు వాడే యాంటి బయాటిక్స్ పనిచేయకపోవటం మానవాళికే కాకుండా ప్రతి జీవికి కూడా తీవ్రమైన నష్టమే. ప్రస్తుతం మందుల్లో 50శాతం పనిచేయటం లేదు. షుగర్, బీపీ, కిడ్నీ, గుండె లాంటి దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారికి ప్రాణాపాయస్థితి ఏర్పడితే ఈ మందులు ప నిచేయక వారిని కాపాడటం కష్టమవుతోంది. మందుల వినియోగంలో మార్పు వస్తేనే భవిష్యత్తు తరాలకు మంచి మనుగడ.

– డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, గుంటూరు

స్నేహ హస్తాలు ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు ఎడ్యుకేషన్: పదేళ్ల క్రితం ఇంజినీరింగ్ విద్యనభ్యసించిన 10 మంది విద్యార్థులు కలిసి స్థాపించిన స్నేహ హస్తాలు సంస్థ తెలుగు రాష్ట్రాల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు విశేషంగా చేయూతను అందించడం అభినందనీయమని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. స్నేహ హస్తాలు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వెనిగళ్ల జ్యోతికి ప్రాజెక్టు వర్క్ నిమిత్తం రూ.40 వేలు విలువైన లాప్‌టాప్‌తో పాటు విజ్ఞాన్ నిరుల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని దేశి రెడ్డి లక్ష్మీపార్వతికి హాస్టల్ వసతి నిమిత్తం రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం రింగ్ రోడ్డులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ దండమూడి విజయ్ మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా అమెరికా, యూకే ఆస్ట్రేలియా, అరబ్ ఎమిరేట్స్‌తో పాటు దేశంలో స్థిరపడ్డ స్నేహితుల బృందం ప్రతినెల కొంత పొదుపు చేసి విద్య, వైద్య సేవలకు చేయూతనందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ టి.కరిముల్లా బాబు పాల్గొన్నారు.



విద్యార్థినుకు లాప్‌టాప్, నగదు అందజేస్తున్న ఎంపీ లావు కృష్ణదేవరాయలు

పినాకిని ఎక్స్‌ప్రెస్ న్యూ గుంటూరు మీదుగా నడపాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడ నుంచి చెన్నై వెళ్లే పినాకిని ఎక్స్‌ప్రెస్‌ను న్యూ గుంటూరు మీదుగా నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు విశ్రాంత ఉపాధ్యాయ సంఘ నాయకుడు జంగాలపల్లి పార్థసారథి, దామచర్ల శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంత్రికి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో బండారు ప్రసాద్, శాఖమూర్తి రామ్మూర్తి, చేపూరి రాజశేఖర్, ముత్తినేని రాజేష్ ఉన్నారు.

వైభవంగా సీతారామ పట్టాభిషేకం



పాదుకలతో ప్రదక్షిణలు చేస్తున్న దంపతులు



శాంతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/13వ అడ్డరోడ్డు ఓంకార క్షేత్రం కుర్తాళం శ్రీసిద్ధేశ్వరీ పీఠపాలిత ఓంకారక్షేత్రంలో నిర్వహిస్తోన్న 91వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవం– 95వ సంఘ వార్షికోత్సవాలు సోమవారంతో ముగిశాయి. సీతారామ పట్టాభిషేకం, శాంతి హోమం పూర్ణాహుతి, అన్నసమారాధన, సీతా రామ పరివార దేవతలతో శోభాయాత్ర నిర్వహించారు. సీతారామ పట్టాభిషేక పూజ పాదుకలను తలపై నుంచి ఆలయ పాలకమండలి వారు పూజలలో హాజరైన దంపతులు ఆలయ ప్రదక్షిణలు చేశారు. అనంతరం శాంతి హోమం మహా పూర్ణాహుతి జరిగింది. రాత్రి సీతారామ పరివార దేవతలతో శోభాయాత్ర చేపట్టారు. కార్యదర్శి నంబూరు వేంకటశ్రీమన్నారాయణమూర్తి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భాగవత రస వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై సోమవారం సాహితీవేత్త పి.ఎస్.ఆర్.ఆంజనేయప్రసాద్ జయంతి నిర్వహించారు. భాగవత రస వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనను నిర్వహించారు. మంత్రాశ్రమం పీఠాధిపతి నరసింహానంద భారతీ స్వామి, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సంస్కృత పండితులు డాక్టర్ డి.ఎస్.దీక్షిత్‌లు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో పి.రవికిషోర్, పి.హైమానంద పాల్గొన్నారు.

పాస్టర్ రత్నశేఖర్‌కు డాక్టరేట్

పెదకాకాని: దేవుని సేవలో 20 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో నమ్మకంగా సేవ చేస్తున్న జి.రత్నశేఖర్‌కు అమెరికన్ బాప్టిస్ట్ ఫారెన్ మిషన్ సొసైటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సోమవారం నంబూరు విజయభాస్కర్‌నగర్ మిలీనియం బాప్టిస్ట్ చర్చి సంఘం ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. రత్నశేఖర్ దంపతులను ఘనంగా సన్మానించారు.

పారిశుద్ధ్య పనుల్లో మెరుగుదల ఉండాలి

కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరంలోని వార్డ్ సచివాలయాల వారీగా పారిశుద్ధ్య పనుల్లో మెరుగుదల ఉండాలని, డ్రెయిన్ల శుభ్రంపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. రెడ్డిపాలెం, గోరంట్ల, శ్యామలా నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు, చుట్టగుంట సెంటర్‌లో అన్న క్యాంటిన్‌ని పరిశీలించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజారోగ్య విభాగం ద్వారా నగర ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శానిటరీ డివిజన్ల పెంపుతో పాటు కార్మికుల రేషనలైజేషన్ చేపట్టామన్నారు. గోరంట్ల మస్టర్ పాయింట్‌ని పరిశీలించి, కార్మికుల, కార్యదర్శుల హాజరు వివరాలు, సెలవుల రిజిస్టర్‌ని తనిఖీ చేశారు. శ్యామల నగర్ పార్క్‌ని పరిశీలించి, పార్క్‌లో వాకింగ్ ట్రాక్, గ్రీనరీ పెంపుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం చుట్టగుంట సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి, ఆహార పంపిణీ అనంతరం క్యాంటీన్‌ని శుభ్రం చేయాలని, తాగునీటి సరఫరాని జాగ్రత్తగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, మధుసూదన్, ఆర్‌ఓ రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్‌లు ఆయుబ్‌ఖాన్, సోమశేఖర్ పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు: ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన సోమవారం పట్టణంలోని సంజీవ్ నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని సంజీవ్ నగర్ నుంచి చేబ్రోలుకు బైక్‌పై పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ శ్రీ హరి ఆకస్మిక దాడిచేసి 120 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం తరలిస్తున్న చేబ్రోలుకు చెందిన ఎం.రాఘవేంద్రను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

నెహ్రూనగర్: పేద విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు అందించేందుకు తాము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామని ది గుంటూరు చిల్లీస్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జంగా నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ముక్కాల విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. రెడ్డి జనాభ్యుదయ మండలి, రెడ్డి జనసేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల చిల్లీస్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన జంగా నర్సిరెడ్డి, ముక్కాల విజయభాస్కర్‌రెడ్డికి ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చిన్నతనంలో ఎన్నో కష్టాలు పడ్డామని, చదువుకోవడానికి కూడా చాలా ఇబ్బందులు పడ్డామని, కాని నేటి తరం విద్యార్థులు దాతల సహకారాలను అందిపుచ్చుకుంటూ ఇష్టంతో కష్టపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరవచ్చన్నారు. కార్యక్రమంలో రెడ్డి జనసేవా సమితి నాయకులు కంది సంజీవరెడ్డి, చల్లా అంజిరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, సూరసాని వెంకట్‌రెడ్డి, భవనం వెంకటరెడ్డి, ఉడుముల శ్రీనివాసులరెడ్డి, జంగా సత్యనారాయణరెడ్డి, సీతారామ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



సంఘ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణకు మార్చి 31 వరకు అవకాశం

నెహ్రూనగర్: అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణకు మార్చి 31వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం తెలిపారు. అనుమతించిన ప్లాన్‌కి భిన్నంగా, అనధికారికంగా 2018 ఆగస్టు 31వ తేదీలోగా నిర్మాణం చేసి, క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసి, పరిష్కారం చేసుకోని అర్జీదారులు ఈ ఏడాది మార్చి 31 వరకు రాష్ట్ర ప్రభుత్వం గడువు పెంచిందని, సదరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2018, ఆగస్టు 31వ తేదీలోగా ప్లాన్‌కి భిన్నంగా, అనధికారికంగా నిర్మాణం చేసుకున్న భవనాల క్రమబద్ధీకరణకు 2019 జనవరి 1న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, సదరు ఉత్తర్వుల మేరకు అర్జీలు దాఖలు చేసుకున్నవారి అర్జీల పరిష్కారానికి తొలుత 2024 డిసెంబర్ 31 వరకు గడువు మాత్రమే ఉందని ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం సదరు గడువుని ఈ ఏడాది మార్చి 31 వరకు పెంచిందన్నారు. అర్జీదారులు చెల్లించాల్సిన అపరాధ రుసుం, దస్తావేజులను ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేసుకోవాలని కోరారు. లేనిచో సదరు నిర్మాణాలను నిరంతర నేరంగా పరిగణించి చట్ట ప్రకారం చర్యలు, నిర్మాణం తొలగించడం, అదనపు భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయకపోవడం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న భవనానికి ఇంటి పన్నుపై 25 నుంచి 100 శాతం వరకు అదనంగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ఇంజినీరింగ్ అధికారుల అంతర్గత బదిలీలు

- 9 మంది వార్డు ఎమినిటీ సెక్రటరీలకు ఇన్‌చార్జి ఏఈ బాధ్యతలు
- రోస్టర్ పాటించకపోవడంతో ఎమినిటి సెక్రటరీలు అసహనం
- కోర్టును ఆశ్రయించనున్న వైనం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో అంతర్గత బదిలీలు చేస్తూ నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కొంత మంది డీఈలకు, ఏఈలకు మార్పులు, చేర్పులతో పోస్టింగ్‌లు ఇచ్చారు. దీంతో పాటు 9 మంది వార్డు ఎమినిటి సెక్రటరీలకు కూడా ఇన్‌చార్జి ఏఈ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డీఈలు, ఏఈల అంతర్గత బదిలీల్లో తమ అనుకునే వారికి ఎక్కువ వార్డులు కేటాయించారని, తమకు కాని వారికి పోస్టుల్లో కోత విధించినట్లేనని కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు స్పష్టంగా అర్థమవుతోంది.

రోస్టర్ పాటించకుండానే..

నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏఈల కొరతతో వార్డు ఎమినిటి సెక్రటరీలను ఇన్‌చార్జి ఏఈలుగా వినియోగించుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో గత ఏడాది సెప్టెంబర్‌లో 10 మంది వార్డు ఎమినిటి సెక్రటరీలకు ఇన్‌చార్జి ఏఈల బాధ్యతలు అప్పగించారు. ఈ పది మందికి సీనియార్టీ, రోస్టర్ చూడకుండా పోస్టింగ్స్ ఇవ్వడంపై దుమారం రేగడంతో నగర కమిషనర్ వారిని గత సంవత్సరం డిసెంబర్ 31 నుంచి విధుల నుంచి తొలగించారు. ఆ తరువాత వార్డు ఎమినిటిలకు ఇన్‌చార్జి ఏఈల పోస్టింగ్ ఇచ్చే బాధ్యతలను నెల్లూరు జిల్లాలోని పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ ఎస్ఈ(జోనల్ ఆఫీసర్)కి అప్పగించారు. సదరు ఎస్ఈ నగరపాలక సంస్థ పంపిన జాబితానే తిరిగి రోస్టర్ చూడకుండానే తొమ్మిది మందికి ఇన్‌చార్జి ఏఈలుగా బాధ్యతలు అప్పగిస్తూ గత కొద్ది రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపైన కూడా ఎమినిటి సెక్రటరీలు కొంత అసహనం వ్యక్తం చేయడంతో కొద్ది రోజుల సదరు ఉత్తర్వులను అమలు చేయకుండా ఆపేశారు. తీరా సోమవారం రాత్రి హడావుడిగా వార్డు ఎమినిటి సెక్రటరీలకు ఇన్‌చార్జి ఏఈ బాధ్యతలు అప్పగించడంపై వార్డు ఎమినిటి సెక్రటరీలు, అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సీనియార్టీ, రోస్టర్ చూడకుండా, విధులకు గైర్హాజరైన వారికి ఏ విధంగా ఇన్‌చార్జి ఏఈలు పోస్టింగ్‌లు ఇస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. దీనిపై కొంత మంది సెక్రటరీలు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

ఎన్నికల కోడ్ ఉంటే కొత్త పోస్టింగ్‌లు!

ప్రస్తుతం కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎన్నికల కోడ్ అమలు ఉంది. నగరపాలక సంస్థ పరిధిలో అంతర్గత బదిలీలు చేసుకునే వెసులుబాటు ఉన్నప్పటికి...వార్డు ఎమినిటీ సెక్రటరీలకు కొత్తగా ఇన్‌చార్జి ఏఈల పోస్టింగ్ ఏ విధంగా ఇస్తారంటూ కొంత మంది సెక్రటరీలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.



కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు

అపరాలతో అధిక ఆదాయం

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డలో ప్రపంచ అపరాల దినోత్సవం సందర్భంగా రైతులకు లాంఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో అపరాల పంటలపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో అపరాల విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.మోహనరెడ్డి మాట్లాడుతూ లాంఫాం నుంచి నూతనంగా విడుదలైన వంగడాలను, వాటి రకాలను, యాంత్రీకరణకు అనువైన రకాలను రైతులు వినియోగించుకుని పంటల సాగు ఖర్చులను తగ్గించుకుని అధిక దిగుబడులు, ఆదాయం పొందవచ్చన్నారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ అపరాల పంటల్లో పంట మార్పిడి విధానాన్ని పాటించాలని సూచించారు. అపరాలను రోజువారీ మన ఆహార విధానాలలో భాగం చేయటం ద్వారా ఆరోగ్యానికి మేలు జరుగుతుందని వివరించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి రైతుల సందేహాలకు సలహాలను అందించారు. కార్యక్రమంలో ఇతర ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ పీ వెంకటరావు, డాక్టర్ ఎన్‌వీఎస్ గోపాలస్వామి, డాక్టర్ సాంబశివరావు, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ కేవీ శివారెడ్డి, డాక్టర్ జె.సతీష్‌బాబు, రైతులు నామా శ్రీనివాసరావు, నవీన్‌రెడ్డి, ఆనందకుమార్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

పెదరావూరు శివారులో ఆలయానికి శంకుస్థాపన

పెదరావూరు(తెనాలి): రూరల్ మండల గ్రామం పెదరావూరు శివారులో గల శ్రీమహా విద్యాపీఠం. అభయహస్త సుబ్రహ్మణ్య క్షేత్రంలో సోమవారం శ్రీలక్ష్మీగణపతి, బాలాంబిక సమేత సర్వహితేశ్వర స్వామి ఆలయన శంకుస్థాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీకాంచి కామకోటి మూలామ్నాయ సర్వజ్ఞపీఠాధిశ్వరులు జగద్గురు శ్రీశంకరాచార్య శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో లోక కల్యాణార్థమై దేవాలయ నిర్మాణానికి సంకల్పించిన విషయం తెలిసిందే. ఆ ప్రకారం సుబ్రహ్మణ్య క్షేత్రానికి ఈశాన్య దిశన 30 సెంట్ల విస్తీర్ణంలో ఆలయ నిర్మాణానికి సన్నాహాలు చేశారు. ఈ క్రమంలో ఉదయం 11.12 గంటలకు శంకుస్థాపన చేశారు. అవసరమైన విశేష పూజలు చేశారు. ఆలయంలో ఎలాంటి రుసుం లేకుండా దైవానుగ్రహం కోసం వచ్చిన భక్తులు స్వామివారిని తామే స్వయంగా అభిషేకించుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు సుబ్రహ్మణ్య క్షేత్ర నిర్వాహకుడు చింతపల్లి సుబ్రహ్మణ్యస్వామి వెల్లడించారు.

పశువుల్లో నైట్రేట్ విషప్రభావంపై అప్రమత్తం

తెనాలి: పశువుల్లో నైట్రేట్ విషప్రభావం లేకుండా పశుపోషకులు చూసుకోవాలని స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని ప్రదేశాల్లో నీటిలోనూ, పచ్చిగడ్డి, ఎండుగడ్డి, పాతర గడ్డిలోనూ నైట్రేట్ శాతం 0–500 పీపీఎం ఉన్నట్లుగా పరీక్షల్లో తేలిందన్నారు. నైట్రేట్ శాతం కేవలం 100 పీపీఎం లోపు ఉన్నట్లయితే ఆ మేత/నీరు పశువులకు ఎలాంటి హాని చేయదని తెలిపారు. అధిక నేట్రేట్‌తో కూడిన నీరు, మేత తీసుకున్న పశువులు అరగంట నుండి నాలుగు గంటలలోపు విషప్రభావానికి లోనవుతాయని తెలిపారు. నీటి లేదా చాక్లెట్ గోధుమరంగు శ్లేష్మ పొరలు, వేగంగా లేదా కష్టంగా శ్వాస తీసుకోవటం, శ్వాస తీసుకోవటం శబ్దం, నాడి వేగవంతంగా కొట్టుకోవటం, లాలాజలం కారుట, ఉబ్బరం, వణుకు, అస్థిరంగా ఉండటం, తరచుగా మూత్రం పోయటం, పారుడు లక్షణాలు, కడుపు నొప్పి, చూడి పశువులు ఈసుకుపోవటం, పాడిపశువుల్లో పాల దిగుబడి తగ్గటంతో పాటు, పశువు బలహీనమై కోమలోకి వెళ్లటం, ఒక్కోసారి మరణించటం కూడా సంభవిస్తుందని వివరించారు. రైతులు, పశుపోషకులు వీటిని గమనించి సకాలంలో వైద్యం చేయించాలని సూచించారు.